క్లుప్తంగా

చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం స్వశక్తి మహిళా గ్రూపు సభ్యులకు ప్రమాద బీమాను రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. దేశాయిపేటకు చెందిన కట్టెకోల సౌమ్య విద్యుదాఘాతంతో మృతిచెందగా.. మృతురాలి కుటుంబానికి మంజూరైన రూ.10లక్షల చెక్కును ఎమ్మెల్యే శనివారం అందజేశారు. స్త్రీనిధి రీజనల్ మేనేజర్ ఎస్కే మదార్, ఏపీఎం నర్మద, సాయిచరణ్, చంద్రనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మధురానగర్ గ్రామానికి చెందిన విశ్వనాథ శ్రీనివాస్ కుటుంబానికి మంజూరైన రూ.2.40లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శనివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్ధిదారుకు అందజేశారు. శ్రీనివాస్ కూతురు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా.. దాదాపు రూ.6లక్షలు ఖర్చయ్యాయి. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కొంతమేర ఆర్థిక సాయం అందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



బుక్‌లెట్ విడుదల చేస్తున్న నాయకులు

మానకొండూర్: కార్మిక హక్కులకు భంగం కల్గించే ద్రోహపూరిత నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి కోరారు. సదాశివపల్లి రైస్ మిల్లుల వద్ద సమ్మె బుక్‌లెట్ విడుదల చేసి మాట్లాడారు. రైస్ మిల్లు ఆపరేటర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ భద్రయ్య, రైస్ మిల్ హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి సంపత్, సీఐటీయూ మండల కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పోచయ్య, శ్రీనివాస్, గంగయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు పీఎంశ్రీ పథకం కింద ప్రభుత్వం నుంచి అందించిన కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా మానిటరింగ్‌ను పరిశీలించి ఆన్‌లైన్ వైఫై సేవలను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంపై చొరవ చూపాలి

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ స్టెప్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ ఇప్పించాలనే లక్ష్యంతో రాంనగర్‌లో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంపై చొరవ చూపాలని కోరుతూ శనివారం తెలంగాణ యువజన సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువజన సమితి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత సత్తినేని శ్రీనివాస్ మాట్లాడుతూ వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం అధికారుల పర్యవేక్షణ లేక నిరుపయోగంగా మారిందని అన్నారు. శిక్షణలకు అవసరమైన బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన సమితి జిల్లా కార్యదర్శి జక్కని సాయిరాం, సంయుక్త కార్యదర్శి వేముల రమణాచారి, మహిళా సంఘాల సభ్యులు స్వప్న, సునీత పలు యువజన స్వచ్ఛంద, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌లో ఉచిత శిక్షణ

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర ప్రభుత్వ అత్యంత వెనకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతకు సాఫ్ట్ స్కిల్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అనిల్ ప్రకాశ్‌కిరణ్ తెలిపారు. నాలుగు రోజులపాటు ఇచ్చే శిక్షణకు హాజరయ్యేవారికి ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వబడుతుందన్నారు. 21–30 ఏళ్ల లోపు డిగ్రీ ఉత్తీర్ణత సాధించినవారు తమ ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో జూలై 12 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆదాయం పట్టణ ప్రాంతంలోని వారికి రూ.2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షలు ఉండాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలకు సంబంధిత ధ్రువపత్రాలు జతపరిచి కరీంనగర్‌లోని జిల్లా బీసీ అభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

కూడళ్లు పెద్దగా.. రోడ్లు చిన్నగా..

- ప్రమాదకరంగా మారుతున్న చౌరస్తాలు
- గందరగోళంగా ట్రాఫిక్
- నియంత్రణకు చర్యలు శూన్యం



జమ్మికుంట పట్టణంలోని గాంధీచౌక్ చౌరస్తా



హుజూరాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా

హుజూరాబాద్: పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణపై అధికార యంత్రాంగం దృష్టి సారించకపోడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లోని ప్రధాన చౌరస్తాల వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఏ వాహనం ఎటు వైపు నుంచి వస్తుందో అర్థం కాని పరిస్థితి. చిన్న వాహనదారులు ట్రాఫిక్‌రూల్స్‌ను బేఖాతారు చేస్తూ పెద్ద వాహనాలకు ఎదురుగా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు.

వాహనదారుల ఇబ్బందులు

జమ్మికుంట పట్టణంలోని గాంధీ, హుజూరాబాద్లోని అంబేడ్కర్ చౌరస్తాలు పెద్దగా ఉండి దాని పక్కన ఉన్న రహదారులుగా చిన్నగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. హుజూరాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద లారీలు, వ్యాన్‌లు, స్కూల్, ఆర్టీసీ బస్సులను జమ్మికుంట నుంచి కరీంనగర్ వైపు తిప్పాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. అలాగే జమ్మికుంటలోని గాంధీ చౌక్ వద్ద ఇదే పరిస్థితి. అటు కోరపల్లి, ఇటు వీణవంక, రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి ఉండగా చౌరస్తా చుట్టూ ఉన్న రోడ్డు ఇరుకుగా ఉంది. దానికి ఆనుకునే చిరువ్యాపారులు వ్యాపారం చేస్తుండంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గందరగోళంగా ట్రాఫిక్

హుజూరాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తా, సైదాపూర్ క్రాస్, డిపో క్రాస్ చౌరస్తాల వద్ద విద్యార్థులు, వృద్ధులు, సామాన్యులు రోడ్డు దాటే క్రమంలో వాహనాలు రూల్స్ పాటించకుండా వస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. చౌరస్తాలకు 100 మీటర్ల దూరంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే వాహనాలు నెమ్మదిగా వచ్చే అవకాశం ఉంది. కాగా, ఆయా కూడళ్ల వద్ద ఏ వాహనం ఎటు నుంచి వస్తుందో అర్థం కాని పరిస్థితి. అలాగే జమ్మికుంట పట్టణ ప్రవేశ ద్వారం, అంబేడ్కర్ చౌరస్తా నుంచి మోత్కులగూడెం చౌరస్తా వరకు వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారు. దీనికి తోడు వంతెన కిందభాగంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు శూన్యం

పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ రూల్స్ తీసుకొచ్చేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉండగా.. ఇవేమి జరగకపోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యాంగా వాహనాలను నడుపుతున్నారు. ప్రధాన రహదారులకు అనుకొని వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకి జటిలంగా మారుతుంది. ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ సామాన్య ప్రజలు ఆరోపిస్తున్నారు.

వాహనం తిప్పాలంటే భయమేస్తోంది



అంబేడ్కర్ చౌరస్తా నుంచి వాహనం తిప్పాలంటే భయమేస్తోంది. జమ్మికుంట వైపు నుంచి, వరంగల్ నుంచో, డీసీఎంఎస్ కాంప్లెక్స్ ఏరియా నుంచో ఏ వాహనం ఎటు వైపు నుంచి వస్తుందో అర్థం కాని పరిస్థితి ఉంది. ప్రతీ వాహనదారు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.
– మండల సతీశ్, ఉద్యోగి, హుజూరాబాద్

అస్తవ్యస్తంగా మారింది



పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌కు అనుగుణంగా వెళ్తే ఎలాంటి ప్రమాదాలు జరగవు. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా అధికార యంత్రాంగం ట్రాఫిక్ రూల్స్‌ను అమలు చేయాలి.
– విఠల్‌రావు, రిటైర్డు టీచర్, జమ్మికుంట



హుజురాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



చొప్పదండి: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యం తదితరులు



జమ్మికుంట: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పీవీకి నివాళి

హుజూరాబాద్: మాజీ ప్రధాని పీవీ నరసింహరావు జయంతిని శనివారం నిర్వహించారు. పీవీ సేవాసమితి నాయకులు, అలయన్స్ క్లబ్ సభ్యులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పీవీ సేవాసమితి అధ్యక్షుడు తూము వెంకటరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

చొప్పదండి: క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పీవీ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేశిని కోటి మాట్లాడారు. మాజీ కౌన్సిలర్ మారపల్లి భిక్షపతి, శ్రీపతి నరేశ్, మార్కెట్ డైరెక్టర్ గడ్డం దీక్షిత్, నాయకులు పిట్టల రమేశ్, మర్రి రామిరెడ్డి, సలీం పాషా, మండల మహిళా అధ్యక్షురాలు తోట స్వప్న, పిడుగు భాగ్యలక్ష్మి, పూదరి శివ, మైస మహేందర్, ముద్దమల్ల రవి, పంజాల అజయ్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు ఇంగ్లే రామారావు, కనుమల్ల సంపత్, ఎక్కటి సంజీవరెడ్డి, అన్నం ప్రవీణ్, పెద్ది శివకుమార్, ఓదెలు, ప్రశాంత్, మహేశ్, ధర్మకర్తలు గౌడిశాల పరమేశ్వర్, గోలి కిరణ్, బండి మల్లయ్య, మ్యాడద తిరుపతిరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపక బృందం పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాజేశ్వరరావు, అధ్యాపకులు నరేశ్, రమేశ్, పి.శ్రీనివాస్, రమణారావు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బంధువుల నుంచి చట్టబద్ధమైన దత్తత



బాలికను దత్తత ఇస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన రెండు కుటుంబాల్లోని పిల్లలు లేని వారు వారి బంధువులు, రక్త సంబంధీకుల నుంచి చట్టబద్ధమైన దత్తత తీసుకున్నారు. ఈమేరకు కలెక్టర్ పమేలా సత్పతి దత్తత ఉత్తర్వులను దత్తత తల్లిదండ్రులకు అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ దత్తత కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. బంధువులు రక్తసంబంధీకుల నుంచి దత్తత తీసుకోదలిస్తే జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీసీపీవో పర్వీన్, ఎల్‌సీపీవో రాజు పాల్గొన్నారు.

ఊయలకు చేరిన 15 నెలల శిశువు

కరీంనగర్ మాత శిశు సంరక్షణ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఊయల(క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్)లో శనివారం 15 నెలల వయసున్న మగ శిశువును వదిలివేశారు. శిశువును గమనించిన ఆసుపత్రి సిబ్బంది సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆర్ఎంవో నవీన, వైద్య బృందం ఊయల వద్దకు చేరుకొని బాబును పరీక్షించారు. డీసీపీయూ సిబ్బంది ఆస్పత్రికి చేరుకొని శిశువును కరీంనగర్ శిశు గృహకు తీసుకెళ్లారు. మరిన్ని వైద్య పరీక్షల కోసం సోమవారం తిరిగి ఆసుపత్రికి తీసుకురానున్నారు. డీసీపీవో పర్వీన్, శిశు గృహ మేనేజర్ తేజస్వి, సోషల్ వర్కర్లు రమేశ్, కవిత ఉన్నారు.

చెస్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లో జూలై 12, 13ల్లో జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 3వ ఆల్ ఇండియా జూనియర్ చెస్ పోటీల పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. చిన్నారుల మేధస్సుకు పదును పెట్టే క్రీడ చదరంగం అని అన్నారు. జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, కోచ్, డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్, జిల్లా క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కాళీచరణ్, భరద్వాజ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన

శంకరపట్నం: కేశవపట్నం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం వైద్యాధికారి శ్రావణ్ సందర్శించారు. వంట గదిలో వంటలు, నిత్యావసర సరుకులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఆరోగ్య స్థితినడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

చిన్నారులకు స్వర్ణామృత ప్రాసన చుక్కలు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో వికాస తరంగిణి పట్టణ శాఖ ఆధ్వర్యంలో 6 నెలల చిన్నారుల నుంచి 16 ఏళ్ల బాలబాలికలకు స్వర్ణామృత ప్రాసన చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. 210 మందికి చుక్కలు వేశారు. వికాస తరంగిణి చీఫ్ కోఆర్డినేటర్ వీరలింగం, ముక్కా శివకుమార్, ప్రధానాచార్యులు డంగరి హరికృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ ముక్క జితేంద్రర్‌గుప్తా, ట్రెజరర్ అంతం రాజిరెడ్డి, ప్రభాకర్‌రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

హుజూరాబాద్: పట్టణంలోని 27వ వార్డులో వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. వార్డులోని ఆయా ప్రధాన రహదారులకానుకొని ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు మురుగు కాలువలను శుభ్రం చేయించారు.

పోలీసుల అదుపులో కాడెద్దుల దొంగలు

వీణవంక: వల్భాపూర్‌కు చెందిన రవికి చెందిన కోడెలాగెలు దొంగతనానికి గురి కాగా.. పోలీసులు నిందుతులను పట్టుకున్నారు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. ఈనెల 19న రెండు కోడె లాగెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఏఎస్ఐ రవి ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు దినేశ్, రఘుపతిని బృందంగా ఏర్పాటు చేశారు. కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామం వద్ద ఎడ్లను అమ్ముతుండగా.. జమ్మికుంట మండలం కేశవపూర్ గ్రామానికి చెందిన తడిగొప్పుల అజయ్, వీణవంక మండలం ఘన్ముక్కుల గ్రామానికి చెందిన మిడిదొడ్డి అభిలాష్‌తోపాటు మరో మైనర్ బాలుడిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వాటిని సదరు రైతుకు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీణవంక: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఇసుక ట్రాక్టర్లను రెడ్డిపల్లి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వారు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఇటీవల రెడ్డిపల్లి గ్రామం వద్ద కలెక్టర్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. శనివారం మానేరు వాగు నుంచి తరలిస్తుండగా.. పది ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆవుల తిరుపతి హెచ్చరించారు.

దారిపై గోడ నిర్మిస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

శంకరపట్నం: కన్నాపూర్ గ్రామంలోని కిష్కిందపల్లెలో వినాయక మండపానికి వెళ్లకుండా రోడ్డుపై గోడ నిర్మిస్తున్న ఐలయ్య అనే వ్యక్తిపై చర్య తీసుకొని పనులు నిలిపివేయాలని ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు మహిళలు ఫిర్యాదు చేశారు. 20 ఏళ్ల క్రితం వినాయక మండపం కోసం స్థలం కొనుగోలు చేసి మండపం నిర్మించుకున్నామన్నారు. వినాయక నవరాత్రుల సందర్భంగా కుంకుమ పూజ, అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. వినాయక మండపం వద్ద సీసీ వేసుకున్నామని, దారిపై గోడ నిర్మాణం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



మానకొండూర్ రూరల్: మండల కేంద్రంలోని తూర్పుదర్వాజ చౌరస్తా సమీపంలో రోడ్డు గుంతలమయమైంది. వేగురుపల్లి దారిలో వాహనాలు, ఇసుక ట్రాక్టర్లు, లారీలు అధిక సంఖ్యలో వెళ్తాయి. ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు గుంతలు పూడ్చాలని వారు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సన్మానం

కరీంనగర్‌క్రైం: కమిషనరేట్ పరిధిలో వివిధ హోదాల్లో పనిచేసి శనివారం ఉద్యోగ విరమణ పొందిన పది మంది పోలీసు అధికారులను కమిషనర్ గౌస్ ఆలం సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో సాయుధ దళ విభాగంలో ఆర్ఎస్సైగా పనిచేసిన డి.స్వామి, ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న సీహెచ్.శ్రీనివాస్, గన్నేరువరంలో ఏఎస్సైగా పని చేస్తున్న పి.లక్ష్మీనారాయణ, వీణవంక పీఎస్‌లో ఏఎస్సై పి.రవి, గంగాధరలో ఏఎస్సై పి.కిష్టయ్య, కరీంనగర్ టూ టౌన్‌లో పనిచేస్తున్న ఏఎస్సై జి.అనంతరెడ్డి, సాయుధ దళ విభాగంలో ఏఎస్సైగా పనిచేస్తున్న శంకరయ్య, సాయుధ దళ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.సారంగపాణి, మానకొండూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎండీ బాగ్దాద్, వీణవంక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పోలీసు శాఖకు సుదీర్ఘకాలం పాటు విశేషమైన సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై సురేందర్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

జమ్మికుంట: పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వృత్తి ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించిన కల్వకోట వెంకట శ్రీనివాస్‌రావు విరమణ సన్మాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. వృత్తి విద్య విధులతోపాటు పాఠశాలలో విద్యార్థులు, పాఠశాల అవసరాలు తీర్చడంలో సమర్థవంతంగా నిర్వహించారన్నారు. శ్రీనివాస్‌రావు దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఎంఈవో హేమలత, ప్రధానోపాధ్యాయుడు నల్లగొండ సదానందం, స్థానిక బాలికల, మడిపల్లి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, భాగ్యమ్మ, రామచంద్రరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



శ్రీనివాస్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రసమయిని విమర్శించే స్థాయి లేదు

తిమ్మాపూర్: మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ అన్నారు. శనివారం తిమ్మాపూర్ మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అనుమతులు తీసుకొని శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేసుకుంటే అడ్డుకునేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటినుంచి మేము కూడా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. రసమయి అవినీతి అని మాట్లాడే మీరు.. అవినీతి ఎక్కడ జరుగుతుందో నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. వంతడుపుల సంపత్, పాశం అశోక్‌రెడ్డి, పొన్నం అనిల్‌గౌడ్, మాతంగి లక్ష్మణ్, బోయిని తిరుపతి, కవ్వంపల్లి పద్మ, కరివేద జనార్దన్‌రెడ్డి, సుదగోని సదయ్యగౌడ్, ఖమ్మం కృష్ణ, గడ్డి రమేశ్, దేవేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావుల రమేశ్

ఎంబీఏ విద్యార్థులకు ప్రత్యేక కోర్సు ప్రారంభం

కరీంనగర్‌రూరల్: ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో రుబికాన్ ఫౌండేషన్–బజాజ్ ఫిన్ సర్వ్ ఆధ్వర్యంలో శనివారం ఎంబీఏ విద్యార్థులకు సీపీబీఎఫ్ఐ ప్రత్యేక కోర్సును కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థుల్లో నైపుణ్య సాధనకు ప్రత్యేక కోర్సు దోహదపడుతుందని తెలిపారు. 16రోజులపాటు బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ తదితర రంగాల్లో శిక్షణ ఇచ్చిన అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్, ఏవో రాజశేఖర్‌రెడ్డి, ఎంబీఏ హెచ్‌వోడీ ప్రవీణ్‌కుమార్, సంతోషి, రజితరెడ్డి, మహ్మద్ ఇలియాస్ అలీ, అజారుద్దిన్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్

వాటర్ ప్లాంటుకు విద్యుత్ సరఫరా నిలిపివేత

వీణవంక: కనపర్తి గ్రామంలో బాలవికాస వాటర్ ప్లాంటుకు విద్యుత్ అధికారులు కరెంట్ బిల్లు చెల్లించలేదని సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామస్తులు మంచినీటి కోసం ఇబ్బంది పడ్డారు. గతంలో గ్రామానికి చెందిన వ్యక్తి వాటర్ ప్లాంట్ నిర్వహణ బాధ్యతలు చూసుకునేవాడు. గత నెల నుంచి బాధ్యతల నుంచి తప్పుకోవడంతో గ్రామ పంచాయతీ అధీనంలోకి తీసుకుంది. అయితే ఇప్పటివరకు రూ.15వేల కరెంట్ బిల్లు పెండింగ్‌లో ఉండడంతో.. శనివారం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ నిలిపివేశారు. మంచినీటి కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వచ్చిందని వాపోయారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విధుల్లో కార్యదర్శి నిర్లక్ష్యం

ఇల్లందకుంట: సమాచారం హక్కు చట్టం ద్వారా జీపీ వివరాలడిగిన ఆర్టీఐ దరఖాస్తుదారుడితో పంచాయతీ కార్యదర్శి దురుసుగా ప్రవర్తించారు. శనివారం సిరిసేడు గ్రామానికి చెందిన జె.అనిల్ ఇల్లందకుంట జీపీకి చెందిన అభివృద్ధి నిధుల వివరాలతో కూడిన సమాచారం కోసం ఇల్లందకుంట కార్యదర్శికి ఆర్టీఐ ద్వారా దరఖాస్తు అందజేశాడు. దరఖాస్తు చేసిన రిసీవ్డ్ కాపీని కార్యదర్శిని అడగగా.. నేను పనిలో ఉన్నానని, నీకు ఇవ్వాల్సిన అవసరం లేదంటూ దురుసుగా ప్రవర్తించాడన్నారు. సామాన్య పౌరుడిగా ఆర్టీఐ ద్వారా దరఖాస్తు ఇచ్చినప్పుడు సమాచార అధికారి అదే సమయంలో రిసీవ్ కాపీ ఇవ్వాలని తెలియదా అని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శిపై శాఖాపరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తానన్నారు. ఎంపీవోను వివరణ కోరగా.. బిజీగా ఉండి రిసీవ్డ్ కాపీ ఇవ్వలేదని, ఎలాంటి దురుసు ప్రవర్తన లేదని కార్యదర్శి తెలిపారన్నారు.

వైద్యశిబిరం

జమ్మికుంట: వావిలాల పీహెచ్‌సీ పరిధిలోని జమ్మికుంట బాలుర సంక్షేమ వసతి గృహంలో డా.చందన ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడి తొలగింపు

మానకొండూర్: బీఆర్ఎస్ కొండపల్కల గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్‌ను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీకి విరుద్ధంగా వ్యవహరిస్తున్నందున తొలగిస్తున్నట్లు చెప్పారు.